క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

పరకాల : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ 1, గణితం విభాగాల, 1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు, రిజర్వు కేటగిరి ఎస్సీ, ఎస్టీ 50 శాతం, మార్కులతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అలాగే పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన విద్యార్థులకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీన సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈనెల 9న ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు.

యూనివర్సిటీ లా కళాశాలలో హరితహారం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ లా కళాశాలలో విద్యార్థులతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్ శనివారం పలు మొక్కలు నాటారు. తొలుత ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సుదర్శన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాతంగి రమేష్‌బాబు, చల్లా శ్రీనివాస్, హరిప్రసాద్, మధు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. జకోటియా కాంప్లెక్స్, వాసవీ కాలనీ, కొత్తవాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, చోటే మసీదు, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కిషన్‌పుర మెయిన్ రోడ్డు, కేయూసీ కూడలి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నకిలీ దంత వైద్యులతో జాగ్రత్త

నయీంనగర్: గుర్తింపులేని దంత వైద్యులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.మనోరంజన్ రెడ్డి, వరంగల్ సెక్రటరీ డాక్టర్ వేణుయాదవ్ సూచించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వేణు మాట్లాడుతూ నేషనల్ దంత వైద్య గుర్తింపు లేని, స్పెషాలిటీ పూర్తి కాని డాక్టర్ జి.శేషుకుమార్ జీఎల్ఎస్ డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నారని అన్నారు. నకిలీ వైద్యుల ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోవద్దని, అర్హత లేని వైద్యులు నాణ్యత లేని మెటీరియల్స్‌తో నకిలీ ఇంప్లాంట్స్ చేస్తున్నారని అన్నారు.

నీటిలోనే రాతికోట ఉత్తర ద్వారం



ఖిలా వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ రాతి కోట ఉత్తర ద్వారం నీటిలో మునిగింది. వర్షం వీడినా ఉత్తర ద్వారం ఇంకా నీటిలోనే ఉంది. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. పర్యాటకులు ఉత్తర ద్వారం వీక్షించే అవకాశం లేదు. ఫస్సడ్ లైట్లు సైతం నీటిలో మునిగిపోయాయి. రాతి కోట ద్వారానికి వేలాడుతున్న పిచ్చిమొక్కలను కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది శనివారం తొలగించారు.

శరీర దానానికి అంగీకారం

విద్యారణ్యపురి: కాజీపేట మండలం భట్టుపల్లి నివాసి, విద్యా ఫౌండేషన్ సభ్యురాలు, కవయిత్రి సొన్నాయిల కృష్ణవేణి, ఆమె కుమారుడు మణితేజ అవయవ, శరీర దానానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు అంగీకార పత్రాలపై వారు సంతకాలు చేశారు.

వెంకటేశ్వర్లుకు బీవీపీ అవార్డు

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ (బీవీపీ) అవార్డును నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు అందుకున్నారు. విద్యారంగం, ఆధ్యాత్మిక విభాగంలో ఆయన అందిస్తున్న సేవలకుగాను ఆయనకు పురస్కారాన్ని కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి సుబ్రమణ్యం, బీవీపీ ప్రాంత అధ్యక్షుడు నాగేశ్వర్ గుప్తా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ అందజేశారు.

గంజాయి పట్టివేత

ఖిలా వరంగల్: గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి అతని నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు రూ.700 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు.

ఏడేళ్లు గడుస్తున్నా నెరవేరని హామీ



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రోగి వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్

- 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని స్థానికుల డిమాండ్
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పట్టణాలకు పరుగులు తీస్తున్న రోగులు

ఐనవోలు : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్న అప్పటి ప్రజాప్రతినిధుల హామీ ఏడేళ్లు గడుస్తున్నా నెరవేరలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 26,100 జనాభా ఉన్నారు. వీరితో పాటు నిత్యం వందలాది మంది, జాతర సమయంలో వేలాది మంది మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయానికి వస్తుంటారు. వీరికి ఎలాంటి అనారోగ్య, అత్యవసర వైద్యసేవలుకు ఈ ఆస్పత్రినే పెద్దదిక్కుగా ఉంది. ప్రస్తుతం రోజుకి సుమారు 90–100 మంది వరకు ఓపీ విభాగంలో ఆస్పత్రికి వస్తున్నారు. 10–15 మంది ఇన్‌పేషెంట్లు అవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా ప్రసవాలు, ప్రమాదాలు, గుండె సంబంధిత, ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు పీహెచ్‌సీని నుంచి వైద్యసాయం పొందే అవకాశం లేకపోవడంతో రోగుల తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సుమారు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పట్టణ కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పలువురు వాపోతున్నారు.

హామీ నెరవేర్చాలి



పేదలు అధికంగా ఉండే ప్రాంతం, యాత్ర స్థలం అవడం వల్ల ప్రభుత్వం స్పందించి నిరంతరాయంగా వైద్యులను అందుబాటులో ఉంచి అన్ని రకాల వైద్యసేవలు అందించాలి. 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి. గతంలో పాలకులు ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చాలి.

– రాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

ఓపీ పెరిగింది..

రోజురోజుకి రోగుల తాకిడి పెరుగుతోంది. ఐనవోలు జంక్షన్ పాయింట్‌గా ఉండటంతో వివిధ మండలాలకు చెందిన రోగులు కూడా ఆస్పత్రికి వస్తున్నారు. జ్వరాలు, యానిమల్ బైట్‌తో పాటు గర్భిణులకు కూడా వైద్యసేవలు అందిస్తున్నాం. డేటా ఎంట్రీ ఆపరేటర్ లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు. ఇద్దరు స్టాఫ్ నర్సులతో పాటు మరో వైద్యుడి అవసరం ఉంది.

– శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్, ఐనవోలు



వైద్య సేవలకు వేచి ఉన్న రోగులు

వైద్యసిబ్బంది కొరత

ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఒక్కరే సేవలు అందిస్తుండగా 4 గురు స్టాఫ్ నర్సులు ఉన్నారు. దీంతో తలకు మించిన భారంగా మారుతుందని సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు. అయితే రోగుల వివరాలను తెలంగాణ హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో వైద్యుడే అప్‌లోడ్ చేయాల్సి రావడం అదనపు పనిభారంగా మారుతుందని అంటున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని సదరు వైద్యుడు ఉన్నతాధికారులను కోరుతున్నా ఇప్పటికీ నియమించలేదని అంటున్నారు. 24 గంటల వైద్యసేవలు అందించే ఆస్పత్రి అవడం, రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతుండటం, జఫర్‌ఘడ్, బొల్లికుంట, ఖిలావరంగల్, వర్ధన్నపేట, రాయపర్తి మండలాలకు చెందిన కొందరు ఐనవోలు పీహెచ్‌సీకి వచ్చి వైద్యం పొందుతున్నారని, మరో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉంటే పరిస్థితి మెరుగుపడుతుందని సిబ్బంది, స్థానికులు అంటున్నారు.

ప్రశాంతంగా గణపతి నిమజ్జనం

- ఆర్డీఓ నారాయణ, ఏసీపీ సతీష్‌బాబు



మాట్లాడుతున్న అధికారులు

పరకాల : పట్టణంలో గణేశ్ నిమజ్జన వేడుకలను భక్తులు, ఉద్యోగుల సమన్వయంతో ప్రశాంతంగా ముగించినట్లు పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. పరకాల చలివాగు వద్ద శనివారం తెల్లవారుజాము వరకు కొనసాగిన గణపతి నిమజ్జనాన్ని పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మతో కలిసి పర్యవేక్షించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిమజ్జనంలో విధులు నిర్వర్తించిన మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖ, పోలీసు శాఖ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే సీజీఆర్ఎఫ్

- వేలేరు లైన్‌మెన్‌పై అధికారుల ఆగ్రహం



మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

వేలేరు : విద్యుత్ వినియోగదారులకు నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే సీజీఆర్ఎఫ్ ఏర్పాటు చేసినట్లు టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ఎన్వీ.వేణుగోపాలాచారి స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో భీమదేవరపల్లి, కొత్తకొండ, వేలేరు, నారాయణగిరి తదితర సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ బావుల వద్ద వేలాడుతున్న తీగలు, ఒరిగిన స్తంభాలను సరిచేయడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు మరమ్మతు, ఇతర మరమ్మతులకు వచ్చినప్పుడు సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు. అలాగే లైన్‌మైన్‌కు, సిబ్బందికి రూ.6 వేలు లంచం ఇచ్చినట్లు ఓ వినియోగదారుడు ఫిర్యాదు చేయగా అధికారులు లైన్‌మెన్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొంత మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు వస్తే కావాల్సిన సామగ్రి రైతులనే కొనుగోలు చేసి తీసుకురావాలని సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే పొలాల నడుమ ట్రాన్స్‌ఫార్మర్‌లను తొలగించాలని, వాటికి ఎర్త్ రావడంతో పశువులు మృతి చెందుతున్నాయని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గృహజ్యోతి పథకం తమకు వర్తించడం లేదని, ఇళ్ల పైన ఉన్న హై టెన్షన్ తీగలను తొలగించాలని ఫిర్యాదు చేశారు. టెక్నికల్ జనరల్ మేనేజర్ రమేశ్, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ దేవేందర్, వినియోగదారుల ఫోరం సభ్యుడు రామారావు, డీఈ సామ్యా నాయక్, ఏడీఈ రాజేశ్వరరావు, ఏఈ కుమారస్వామి, విద్యుత్ శాఖ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘ముసాయిదా’పై అభ్యంతరాలుంటే తెలపండి



దామెర : ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ కల్పన



నడికూడలో..

- ఎంపీడీఓలు కల్పన, విమల

దామెర : ఓటరు జాబితా ముసాయిదాపై ఏమైన అభ్యంతరాలుంటే తెలుపాలని ఎంపీడీఓ గుమ్మడి కల్పన కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంతో పాటు మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం రెండోసారి డ్రాఫ్ట్ జాబితాను ప్రదర్శించినట్లు చెప్పారు. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో మొత్తం ఓటర్లు 21,883 ఉన్నట్లు తెలిపారు. ఇందులో 10,569 మంది పురుషులు, 11,314 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అదే విధంగా 132 వార్డులకు 132 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు ఆమె వెల్లడించారు. ఈనెల 8న మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్‌లిస్టు, ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ముసాయిదా జాబితా ప్రచురణ

నడికూడ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ విమల శనివారం తెలిపారు. అభ్యంతరాలుంటే తెలుపాలని కోరారు.

విజ్ఞాన జ్యోతిని వెలిగించేది గురువులే



పరకాల : రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు



శాయంపేట : శ్రీవేద పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

పరకాల : అజ్ఞానం అనే చీకటిని రూపుమాపి విజ్ఞాన జ్యోతులను వెలిగించేది గురువులేనని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అమరధామంలో గురుపూజోత్సవం

పట్టణంలోని అమరధామంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గురువును ఘనంగా సన్మానించారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింహరాములు, సభ్యులు భాకర్‌రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల శ్రీవేద పాఠశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గురువులను పూలదండతో, శాలువాతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తిరెడ్డి, వేద, సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఐనవోలు : ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఆదివారం తనిఖీ చేశారు. అవుట్ రీచ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలపై సమీక్షించారు. సింగారం, ఒంటిమామిడిపల్లి, రాంనగర్, కక్కిరాలపల్లిలో జరుగుతున్న వాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. తీవ్ర, మధ్యస్థ పోషకాహార లోపం పిల్లల్లో గుర్తిస్తున్నారా? అందుకు సంబంధించిన పిల్లల ఎత్తు, బరువు, మధ్య పై చేయి చుట్టుకొలతలు తీసుకుంటున్నారా? అని అడిగారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు, జ్వర సర్వే, డ్రైడే కార్యాచరణ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమాల అమలుపై పలు సూచనలిచ్చిన డీఎంహెచ్‌ఓ అప్పయ్య ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ సరిత, స్టాఫ్ నర్సులు సరిత, సుజాత, మమత, హెచ్‌ఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎస్ శ్రీనివాస్, హెచ్‌ఏలు ఫాసిద్దీన్, సతీశ్, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తిలో శనివారం ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన బబ్లూ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగినప్పుడు బాలిక తల్లిదండ్రులు ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లినట్లుగా స్థానికులు చెబుతున్నారు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చిన బాలిక విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సదరు యువకుడు పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది.

చీఫ్ విజిలెన్స్ అధికారికి శుభాకాంక్షలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా బోనాల కిషన్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శనివారం కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఒకరిని కాపాడిన పోలీసులు

ఖిలా వరంగల్: ట్రాక్టర్‌లో కూర్చొని వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఓ భక్తుడికి ఆకస్మాత్తుగా ఫీట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అది గమనించిన మిల్స్‌కాలనీ ఎస్సై శ్రవణ్, కానిస్టేబుల్ చందు వెంటనే అప్రమత్తమై ఆ యువకుడిని పక్కకు తీసుకెళ్లి వైద్య సిబ్బంది సహకారంతో ప్రథమ చికిత్స అందించారు.

ఏబీవీపీ, బీజేపీ ఆధ్వర్యంలో శోభాయాత్ర



పరకాల : శోభాయాత్ర నిర్వహిస్తున్న నాయకులు



శాయంపేట : గణపయ్యను సైకిల్‌పై శోభాయాత్ర నిర్వహిస్తున్న బాలలు

పరకాల : గణేశ్ నిమజ్జనాన్ని ఏబీవీపీ, బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శక్తి స్థల్ నుంచి బయలుదేరిన గణపయ్య రథం పరకాల పురవీధుల గుండా డప్పుచప్పుళ్లతో శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో సైకిల్‌పై..

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో చిన్నారులు ఏర్పాటు చేసిన బాల గణనాథున్ని శుక్రవారం రాత్రి బాలలు సైకిల్‌పై శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. సైకిల్‌పై శోభాయాత్ర నిర్వహిస్తుండగా స్థానికులు ఆసక్తికరంగా తిలకించారు. ‘చిన్నారులకు భక్తిభావం ఎక్కువే’ అంటూ అభినందనలు తెలిపారు. షణ్ముఖ్, ఆదిల్, సోహెల్, నిక్షిత్, దక్షిత్, అనన్య, మనస్విని, మింటూ, వృత్తిక్, కృతిక్ పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన కూస సుమలత తండ్రి కూస రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సుమలతతో పాటు 2001–2002లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.8,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆర్థికసాయం అందించిన వారిలో కోరే మహేందర్, బొమ్మకంటి కుమార్, రాజేందర్, నరేందర్, రాజు, నరేష్, చెన్నబోయిన సరిత, జున్నుతుల మౌనిక, సుజాత, వైనాల జ్యోతి, శైలజ, శ్రీదేవి, కవిత తదితరులు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్‌ఐ మండల సెక్రటరీగా సుభాశ్ కుమార్



నడికూడ : మండలంలోని వరికోల్ జెడ్పీహెచ్ఎస్ పీఈటీ రాయికంటి సుభాశ్ కుమార్‌ను మండల ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) సెక్రటరీగా నియమించినట్లు ఎంఈఓ హనుమంతరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు శివకుమార్, రాంబాబు, ప్రేమానందం, ప్రతిమారాణి సుభాశ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. మండలంలో పాఠశాలస్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు తనవంతు కృషిచేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు



ఐనవోలు : మండలంలోని రైతులను యూరియా కొరత వేధిస్తోంది. శనివారం మండల కేంద్రంలో నందనం సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఉదయం నుంచే రైతులు క్యూ కట్టారు. నిర్వాహకులు 300 బస్తాల యూరియాను క్యూలో ఉన్న రైతులకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. కాగా కొంతమందికి యూరియా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



శాయంపేట : సన్మానం అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులతో అధికారులు



ధర్మసాగర్ : అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ఎంపీడీఓ అనిల్‌కుమార్

ధర్మసాగర్ : ఉన్నతమైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ అన్నారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కార్యక్రమం, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గల టీచింగ్ లెర్నింగ్ సెంటర్‌లో ఎంఈఓ డాక్టర్ రామ్‌ధన్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హాజరై ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధ్యాయులు సంక్లిష్ట పరిస్థితుల్లో సేవలు అందిస్తున్నారని, బోధనాపరంగా సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 17 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి అవార్డులు అందించడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులు సునంద, శైలజ, సురేష్, ఇన్నారెడ్డి, యాస్మిన్, సత్యనారాయణ, సునీత, శ్యాంసుందర్‌రెడ్డి, బాపురావు, రాజు, హిమబిందు, రఘోత్తంరెడ్డి, పూల్‌సింగ్, అనిల్, సురేష్, పద్మ అవార్డులు పొందగా వారిని తోటి ఉపాధ్యాయులు అభినందించారు. ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్, ఉపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు సురేష్, పద్మజ, ప్రసన్న, రమ్యశ్రీ పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, పలు ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు సర్టిఫికేట్లు అందించి శాలువాతో సత్కరించినట్లు ఎంఈఓ భిక్షపతి శనివారం తెలిపారు. 27 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, గట్లకానిపర్తి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కుమార్, ఎంపీపీఎస్ గట్లకానిపర్తి ప్రధానోపాధ్యాయుడు మంత్రి శ్రీనివాస్, శాయంపేట జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ రాముతో పాటు మరో 24 మందిని ఎంపిక చేసి సర్టిఫికేట్లు అందించి శాలువాతో సత్కరించినట్లు చెప్పారు. ఉపాధ్యాయ సంఘం బాధ్యులు తోట రాజయుగంధర్, శ్రీనివాస్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కేయూ క్యాంపస్: వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను శుక్రవారం అందజేసినట్లు కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బిక్షాలు, డాక్టర్ రమణ శనివారం తెలిపారు. పులి విజ్ఞ, సోమ శివాణి, అఖిల, శ్రావణి, అభిజ్ఞ స్కాలర్‌పిష్‌లకు ఎంపిక కాగా, ఒక్కో విద్యార్థినికి రూ.10 వేల చొప్పున ఇన్నర్‌వీల్ క్లబ్ బాధ్యులు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మత్రి రేణుక, సెక్రటరీ అర్చన, వ్యవస్థాపక సభ్యురాలు నేరెళ్ల శోభావతి, కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి పాల్గొని విద్యార్థినులకు అందజేశారని తెలిపారు.